పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరందిస్తాం

- 25న యాసంగి సాగుకు నీటి విడుదల
- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

ఖానాపురంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న దొంతి

ఖానాపురం, డిసెంబర్ 8: పాకాల ఆయకట్టు పరిధిలో యాసంగి పంటకు పూర్తిస్థాయిలో సాగునీరు అందిస్తామని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మండలకేంద్రంలోని రైతు వేదికలో అధికారులు, రైతులతో కలిసి తైబందీ ఖరారు చేశారు. పాకాల ఆయకట్టులో అధికారికంగా 18,250 ఎకరాలు, అనధికారికంగా 11,250 ఎకరాలకు సాగు నీరందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. డిసెంబర్ 25న యాసంగి సాగుకు నీరు విడుదల చేస్తామన్నారు. ఏప్రిల్ నెలాఖరు నాటికి పంటకాలం పూర్తయ్యే విత్తనాలనే రైతులు సాగు చేసుకోవాలని కోరారు. పంటలకు సక్రమంగా నీరందించే బాధ్యత ఇరిగేషన్, రెవెన్యూ అధికారులదేనన్నారు. పాకాల పంట కాల్వల ఆధునీకరణను రూ. 225 కోట్లతో వచ్చే ఏడాది పనులు చేపడతామనన్నారు. సరస్సులో ప్రస్తుతం 22.8 అడుగుల నీరుందని, యాసంగి సాగుకు సరిపోనందున గోదావరి జలాలను తీసుకొస్తామన్నారు. రైతులు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని కోరారు. అనంతరం ఆయన మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. మిషన్‌తో తేమశాతం పరీక్షించగా, మొదటిసారి 34 వచ్చింది. మరోసారి పరీక్షించగా కొంతమేర తగ్గింది. మరో మిషన్‌తో పరీక్షించగా 31 శాతం వచ్చింది. దీంతో ఆశ్చర్యపోయిన ఎమ్మెల్యే నిర్వాహకులను మందలించారు. కచ్చితత్వం పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో ఉమారాణి, ఇరగేషన్ ఈఈ సుదర్శన్‌రావు, నర్సంపేట మార్కెట్ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఏఎంసీ వైస్ చైర్మన్ హరిబాబు, డీఈ రమేశ్, ఏఈలు, రైతులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి కృషి

నర్సంపేట రూరల్: అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే దొంతి అన్నారు. పట్టణంలోని సర్వాపురం 5వ వార్డులో నూతనంగా నిర్మించిన పద్మశాలీ సంఘం భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యేకు పద్మశాలీలు సన్మానించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

రాయపర్తి, డిసెంబర్ 8: మండలకేంద్రంలోని జడ్పీ హెచ్ఎస్ 1998-99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులంతా ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా 25 ఏళ్ల తర్వాత తాము విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాల ఆవరణకు చేరుకున్న పూర్వ విద్యార్థులు తరగతి గదులు, బ్లాక్ బోర్డులు, క్రీడా మైదానం, పాఠశాలలోని ల్యాబ్, గ్రంథాలయాన్ని చూసి భావోద్వేగానికి గురయ్యారు. చిన్నతనంలో పాఠశాలలో చేసిన అల్లరి, కొంటె పనులు, నాడు గురువులు బోధించిన తీరు గుర్తు చేసుకొని ఆనందోత్సహాల మధ్య రజతోత్సవ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. అనంతరం ఆనాడు తమకు విద్యాబోధన చేసిన బిల్ల విజయలక్ష్మి, పాకనాటి రఘునందన్‌రెడ్డి, కొయ్యాడ వాసంతి, ఎన్నం రామ్‌నర్సయ్య, కొల్లూరి డానియల్, పాకాల చంద్రశేఖర్‌ను సత్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు షేక్ సాదికాబేగం, మచ్చ రాజు, మహ్మద్ రఫీ, మచ్చ రమేశ్, కుంట ప్రభాకర్, కన్నెగుండ్ల స్వేత, చిన్నాల రాజు, పబ్బోజు భవానీ, రహీమున్నీసా, సరిత, రజిత, రాజు, అజారుద్దీన్, మహ్మద్ అఫ్సర్‌పాషా, గీత, కలీం, జ్యోతి, లావణ్య, తబస్సుం సుల్తానా, ఉమారాణి, విజయ, సంధ్య, సాద్వీమణి, పర్వీన్, నుస్రత్ జహాన్, స్వప్న, స్వరూప, మైబు, రమేశ్, శివరాజు, సంపత్, బాబు, శ్రీనివాస్, సోమేందర్, హరిశంకర్, రాములు పాల్గొన్నారు.

వైకల్యాన్ని జయించి.. గోల్డ్ మెడల్ సాధించి..

- అంతర్జాతీయ పారా త్రోబాల్ పోటీల్లో బంగారు పతకం
- రమాదేవికి అభినందనల వెల్లువ

గోల్డ్‌మెడల్ అందుకుంటున్న రమాదేవి

సంగెం, డిసెంబర్ 8: వైకల్యం శరీరానికే కాని ప్రతిభకు కాదని.. కృషి, పట్టుదల, నిరంతర సాధన ఉంటే ఏదైనా సాధించొచ్చని నిరూపించింది ఓ యువతి. అంతర్జాతీయ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించి ఔరా అనిపించింది. వివరాల్లోకి వెళ్తే.. సంగెం మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన దామెరుప్పల వరలక్ష్మీ-వీరమల్లు దంపతుల కూతురు రమాదేవి ఈ నెల 5 వరకు కంబోడియాలో జరిగిన అంతర్జాతీయ పారా త్రోబాల్ సిట్టింగ్ పోటీల్లో పాల్గొంది. పేదరికం, అవయ లోపం ప్రతిభకు అడ్డుకాదని నిరూపించింది. మన దేశం తరపున పాల్గొని విశేష ప్రతిభ కనబర్చి బంగారు పతకం సాధించిన రమాదేవిని గ్రామస్తులతోపాటు మండల ప్రజలు అభినందించారు. మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

చిన్ననాటి నుంచే ఆసక్తి

రమాదేవికి ఆరు నెలల వయస్సులో కాళ్లు చచ్చుపడిపోయాయి. వైకల్యాన్ని చదువు ఒక్కటే భర్తీ చేయగలదని నమ్మిన ఆమె చిన్ననాటి నుంచే చదువులో ముందుండేది. చదువుతోపాటు ఆటలు ఆడాలనే తపనతో షాట్‌పుట్, జావెలిన్‌తో వంటి క్రీడలను ప్రాక్టీసు చేసింది. ప్రస్తుతం ఆమె హ్యూమన్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్‌లో పీహెచ్‌డీ చేస్తోంది. పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల కోసం హైదరాబాద్‌లో శిక్షణ పొందుతున్నది.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
సెప్టిక్ ట్యాంక్ క్లినర్
SepTeK
★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు.
Cont: 9849145043, 9866584455.
NTW-326503
SKY ASSOCIATES- WANTED
★Area collection executives, Telecallers, Experience is not required Locations: warangal, Narsampet, wardhannapeta, thorrur, parkal, mulugu, Ghanpur, -Cont 9491465729
NTW-332306
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

ఇరువర్గాల మధ్య ఘర్షణ

కాశీబుగ్గ, డిసెంబర్ 8: వరంగల్‌లోని 14వ డివిజన్ ఎన్టీఆర్ నగర్ అభివృద్ధి కమిటీలో ఇరువర్గాల మధ్య ఆదివారం ఘర్షణ జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. ఇటీవల రాజకీయ పార్టీలకతీతంగా ఎన్టీఆర్‌నగర్ అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేశారు. ఓ పార్టీ వ్యక్తికి కమిటీలో చోటుకు సభ్యులు నిరాకరించారు. దీంతో అతడు మహిళలతో అభివృద్ధి కమిటీని వేయించాడు. ఇంతలో బాలాజీ నగర్‌కు చెందిన ఓ యువతికి ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన అబ్బాయితో ఇటీవల స్థానికులు ప్రేమ వివాహం జరిపించారు. దీంతో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్ ఇరువర్గాలను సముదాయించి గొడవలు లేకుండా చేశాడు. ఈ క్రమంలో ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున ఎనుమాముల పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. ఇంతమంది ఎందుకు వచ్చారని ఇంతియాజ్ మాట్లాడడంతో తాను ఎన్టీఆర్‌నగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షురాలిని అని ఓ మహిళ చెప్పింది. దీంతో ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని ఇంతియాజ్ గట్టిగా అరవడంతో తమను అవమానించాడని మహిళలు ఆందోళనకు దిగారు. ఇంతియాజ్ నుంచి తమను రక్షణ కల్పించాలని మహిళలు పోలీసులను కోరారు. ఈ విషయంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కలుగజేసుకొని ఒక్కటే కమిటీ ఉండాలని సూచించగా, మహిళా కమిటీని రద్దు చేసినట్లు ప్రకటించారు.

ప్రజా సాంస్కృతిక పోరాటాలు స్ఫూర్తిదాయకం

నర్సంపేట, డిసెంబర్ 8: ప్రజా సాంస్కృతిక పోరాటాలు స్ఫూర్తిదాయకమని, బ్రహ్మణ, హిందుత్వ భావజాలానికి వ్యతిరేకంగా సాంస్కృతిక ఉద్యమాన్ని తీవ్రతరం చేద్దామని ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షుడు అరెల్లి కృష్ణ పిలుపునిచ్చారు. నర్సంపేటలోని వాసవీ కల్యాణ మండపంలో ఆదివారం అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కౌన్సిల్ సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా బొద్దుల పాపన్న జెండావిష్కరించారు. ప్రజా కళారూపాలను తన ఆయుధంగా మలుచుకుని దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య పోరాడుతోందన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కె.విశ్వనాథ్, రైతు కూలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి ప్రతాపరెడ్డి, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీమాశంకర్, పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.సరళ, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబ పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న అరుణోదయ సభ్యులు

చపాట మిర్చికి నర్సంపేట పెట్టింది పేరు

- బీఆర్ఎస్ హయాంలో జీఐ ట్యాగింగ్ కోసం దరఖాస్తు
- ఐపీవో ఆమోదంతో రైతులకు మేలు
- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి
- చపాట మిర్చికి జీఐ ట్యాగ్‌పై హర్షం

రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

దుగ్గొండి, డిసెంబర్ 8: ఉమ్మడి వరంగల్ జిల్లాలో పండించే చపాట మిర్చికి జీఐ ట్యాగ్ లభించడంపై నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని తిమ్మంపేటకు చెందిన రైతులు, ఎఫ్‌పీవో రైతు సంఘాలతో ఆదివారం ఆయన సమావేశమయ్యారు. నర్సంపేట నియోజకవర్గంలోని నల్లబెల్లి, దుగ్గొండి, నర్సంపేట రూరల్ ప్రాంతాల్లో చపాట మిర్చిని రైతులు ఎక్కువగా పండిస్తారన్నారు. 2019లోనే గత బీఆర్ఎస్ ప్రభుత్వం జీఐ ట్యాగింగ్ కోసం మిర్చి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ఏర్పాటు చేసి, రెండేళ్ల క్రితం దరఖాస్తు చేసినట్లు గుర్తుచేశారు. నేడు ఇండియన్ పేమెంట్ ఆఫీస్(ఐపీవో) వారు ఆమోదించడం ఈ ప్రాంత రైతాంగానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు.

తెలంగాణ నుంచి జీఐ ట్యాగ్ లభించిన 18వ ఉత్పత్తిగా చపాట నిలిచిందన్నారు. నాడు నియోజకవర్గంలో 32 వేల మంది రైతులను ఏకం చేసి, 89 ఎఫ్‌పీవో సంఘాలు ఏర్పాటు చేశామని పెద్ది వివరిచారు. జీఐ ట్యాగింగ్ రావడం వల్ల హార్టికల్చర్ పంటలకు సబ్సిడీ, రైతులకు శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు అందుబాటులోకి వస్తాయన్నారు. అనంతరం పెద్దిని రైతులు సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్ రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పొన్నం మొగిలి, క్లస్టర్ ఇన్‌చార్జిలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఎఫ్‌పీవో సభ్యులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయం

- పార్టీ రాష్ట్ర నాయకుడు ఈగ మల్లేశం
- కార్యకర్తకు పరామర్శ

బీఆర్ఎస్ కార్యకర్త సురేశ్‌ను పరామర్శిస్తున్న ఈగ మల్లేశం

వర్ధన్నపేట, డిసెంబర్ 8: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయం నుంచి పార్టీ కోసం పని చేస్తున్న కార్యకర్తల కుటుంబానికి బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పార్టీ రాష్ట్ర నాయకుడు, కేంద్ర ఖాదీ బోర్డు మాజీ డైరెక్టర్ ఈగ మల్లేశం అన్నారు. వర్ధన్నపేట పట్టణానికి చెందిన నాగెల్లి సురేశ్ క్యాన్సర్‌తో బాధపడుతుండగా ఆదివారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆర్థిక సాయం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేసిన పోరాటం నుంచి పదేళ్లపాటు రాష్ట్ర ప్రగతి కోసం ముఖ్యమంత్రిగా చేసిన కృషిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు క్రియాశీల పాత్ర పోషించారన్నారు. అంతేకాకుండా పార్టీ స్థాపన నుంచి పురోగతి కోసం అనేక మంది కార్యకర్తలు గ్రామస్థాయి నుంచి పని చేశారని గుర్తుచేశారు. పార్టీ కోసం చిత్తశుద్ధితో పని చేస్తున్న కార్యకర్తలకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా భరోసా ఇచ్చారు. నాగెల్లి సరేశ్ పార్టీలో క్రియాశీలకంగా పని చేశారని గుర్తుచేశారు. సురేశ్ ఆరోగ్యం మెరుగుపడేందుకు తనవంతు సహకారం అందిస్తానని ధైర్యం చెప్పారు. ఆయన వెంట వరంగల్ మాజీ డిప్యూటీ మేయర్ కక్కె సారయ్య, మున్సిపల్ కౌన్సిలర్ తోటకూరి రాజమణి, సీనియర్ నాయకులు సిలువేరు కుమారస్వామి, తుమ్మల యాకయ్య, కరిమిళ్ల సంపత్‌రావు, రాజు, రాజాలు, మహేశ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ముగ్గురు మృతి

ఖిలావరంగల్/గీసుగొండ/చెన్నారావుపేట, డిసెంబర్ 08: దవాఖానల్లో చికిత్స పొందుతూ ముగ్గురు మృతి చెందిన ఘటన జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగింది. సుమారు 66 ఏళ్ల వయస్సు కలిగిన వృద్ధ మహిళ ఈ నెల 7న వరంగల్ ఓసిటీలో అనారోగ్యంతో రోడ్డుపై పడుకోగా, స్థానికులు అంబులెన్స్‌లో ఎంజీఎంహెచ్‌కు తరలించారని మిల్స్‌కాలనీ సీఐ జే వెంకటరత్నం తెలిపారు. ఈ మేరకు ఆమె చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందింది. ఆచూకీ తెలిసిన వారు ఎంజీఎం మార్చురీలో సంప్రదించాలని సీఐ కోరారు. అలాగే, గీసుగొండ శివారులో మహ్మద్ పిరోజ్ ఫామ్‌హౌస్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్న ఆత్మకూరుకు చెందిన మంద పెద్దులు(65)కు ఫామ్‌హౌస్‌లోకి గీసుగొండకు చెందిన సరిత కూలి పనులకు వచ్చేది. ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడడంతో సహజీవనం చేస్తున్నారు. ఈ నెల 6న ఇద్దరి మధ్య గొడవ జరగడంతో పెద్దులు క్రిమిసంహారక మందు తాగాడు. ఎంజీఎం దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ మహేందర్ తెలిపారు. అంతేకాకుండా చెన్నారావుపేట మండలం కల్‌నాయక్‌తండాకు చెందిన లావుడ్యా పూరి(65) అనారోగ్యంతో బాధపడుతున్నది. మనస్తాపంతో ఇంటి వద్ద క్రిమిసంహారక మందు తాగింది. కుటుంబ సభ్యులు ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఆమె కుమారుడు స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేశ్‌రెడ్డి తెలిపారు.

తిలక్ రోడ్డులో మళ్లీ పైపులైన్ లీకేజీ

- రహదారిపై ప్రవహిస్తున్న తాగునీరు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

తిలక్‌రోడ్డులో వృథాగా పోతున్న తాగునీరు

పోచమ్మమైదాన్, డిసెంబర్ 8: వరంగల్ 21వ డివిజన్ తిలక్‌రోడ్డులో ఆదివారం రాత్రి మళ్లీ పైపులైన్‌కు లీకేజీ ఏర్పడింది. దీంతో నర్సంపేట రోడ్డులోని తిలక్‌రోడ్డు ప్రాంతం జలమయమైంది. రోడ్డుపై తాగునీరు వృథాగా ప్రవహిస్తూ నీటి కాల్వలను తలపిస్తున్నది. రాత్రి సమయం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు పాదచారులు సైతం మోకాలు లోతు నీటి లోంచి నడవడానికి ఇక్కట్లకు గురయ్యారు. ఇక్కడే ఎక్కువగా బార్ షాపులు, ఇతర చిల్లర వ్యాపారుల తోపుడు బండ్లు ఉండడంతో రద్దీ ఏర్పడి సమస్యగా మారింది. ఇదే ప్రాంతంలో గతంలో రెండుసార్లు పైపులకు మరమ్మతులు చేపట్టినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దాదాపు ఏడాది కాలం నుంచి ఈ రోడ్డు మార్గంలో పైపులైన్ లీకేజీలు స్వరసాధారణంగా మారుతున్నాయి. లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నప్పటికీ శాశ్వత మరమ్మతులు చేయడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో ఎలా వెళ్లాలని జీడబ్ల్యూఎంసీ అధికారులను ప్రశ్నిస్తున్నారు.

పడిపూజను విజయవంతం చేయాలి

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాలధారులు

కరీమాబాద్, డిసెంబర్ 8: రంగశాయిపేట అయ్యప్ప సేవా పరపతి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న అయ్యప్పస్వామి నగర సంకీర్తన, పడిపూజను విజయవంతం చేయాలని అధ్యక్షుడు కొల్లూరి యోగానంద్ పిలుపునిచ్చారు. రంగశాయిపేటలోని మహాంకాళీమాత ఆలయ ఆవరణలో ఆదివారం నగర సంకీర్తన, పడిపూజ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యోగానంద్ మాట్లాడుతూ ఈ నెల 14న సాయంత్రం 6.15 గంటలకు మహంకాళీమాత ఆలయం నుంచి నగర సంకీర్తన ఉంటుందన్నారు. అలాగే, ఈ నెల 16న రంగశాయిపేటలోని బీరన్నస్వామి ఆలయ ఆవరణలో పడిపూజ చేపట్టనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కత్తి ఎల్లాగౌడ్, బజ్జూరి వీరేశం, అనుమాండ్ల రమేశ్, గండ్రాతి కుమార్, పాల రంజిత్, కే నవీన్‌రెడ్డి, అడుప వేణు, కంచ మల్లయ్య, శంకేశి శ్రీనివాసమూర్తి, బజ్జూరి ప్రభాకర్, సుధాకర్, దయాకర్ పాల్గొన్నారు.

నేడు మాదన్నపేట చెరువు తీరాన పంబా ఆరట్టు

నర్సంపేటరూరల్, డిసెంబర్ 8: నర్సంపేట శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో 24వ (చతుర్వింశతి) మండల పూజ మహోత్సవాల్లో భాగంగా జిల్లాలో రెండో అతి పెద్ద చెరువైన నర్సంపేట మండలం మాదన్నపేట పెద్ద చెరువులో వేలాది మంది మాలదారుల ఆధ్వర్యంలో తాంత్రిక వేత్త, గురుస్వామి సి.వెంకటేష్‌శర్మ వేద మంత్రోచ్చారణల మధ్య పంబా ఆరాట్టు ఉత్సవాలు అత్యంత వైభవంగా సోమవారం జరగనున్నాయి. అయ్యప్ప స్వామి జల క్రీడలు పూర్తయిన అనంతరం మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి-జడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్న దంపతులు అందించనున్న పంబా సద్ది (మహా అన్నదానం)ని మాదన్నపేట పెద్ద చెరువు కట్టపై మాలాధారులు, భక్తులు సహపంక్తి భోజనం చేయనున్నారు. 10 వేల మందికి 18 క్వింటాళ్ల బియ్యంతో అన్నదాన కార్యక్రమానికి ఏర్పాట్లు చేశారు. పంబా ఆరట్టుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని నర్సంపేట శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయ కమిటీ చైర్మన్ మాధవశంకర్ కోరారు.

అర్ధరాత్రి యువకుల హల్‌చల్

మట్టెవాడ, డిసెంబర్ 8: మద్యం మత్తులో యువకులు శనివారం అర్ధరాత్రి మండిబజార్‌లో హల్‌చల్ చేశారు. మండిబజార్‌లోని బిర్యాని సెంటర్ వద్ద రెండు వర్గాల యువకులు మద్యం మత్తులో ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసుల కళ్లెదుటే యువకులు కొట్టుకోవడంతో స్థానికులు ఆశ్చర్యపోయారు. చింతల్ ప్రాంతానికి చెందిన ముగ్గురు వ్యక్తులు, పుప్పాలగుట్టకు చెందిన ప్రభు చరణ్‌పై దాడి చేశారు. ముఖంపై తీవ్ర రక్తస్రావం కావడంతో ఎంజీఎం దవాఖానకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ గోపి తెలిపారు.

వృద్ధురాలి అదృశ్యం

మట్టెవాడ, డిసెంబర్ 8: పోచమ్మమైదాన్‌కు చెందిన వృద్ధురాలు అదృశ్యమైనట్లు సీఐ గోపి తెలిపారు. పోచమ్మమైదాన్ ప్రాంతంలోని జన్ను భిక్షపతి ఇంట్లో తల్లి లక్ష్మి(65) ఉంటున్నది. లక్ష్మి ఈ నెల 6న టీ తాగి వస్తానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. వృద్ధురాలి కూతురు దోమ శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

రామ్ లక్ష్మణ్ థియేటర్ ఎదుట ప్రేక్షకుల ఆందోళన

మట్టెవాడ, డిసెంబర్ 8: మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామ్ లక్ష్మణ్ థియేటర్ వద్ద ఆదివారం రాత్రి ప్రేక్షకులు ఆందోళనకు దిగారు. పుష్ప-2 ఫస్ట్ షో ప్రారంభమైన కొద్దిసేపటికే ఆగిపోయింది. రెండు గంటలపాటు సినిమా తిరిగి ప్రారంభం కాకపోవడంతో ఆవేశానికి లోనైనా ప్రేక్షకులు ఆందోళన చేశారు. ఈ ఘటన సామాజిక మధ్యమాల్లో వైరల్‌గా మారింది.

రేపటి నుంచి మండలస్థాయి పోటీలు

సంగెం/చెన్నారావుపేట, డిసెంబర్ 8: సీఎం కప్ క్రీడోత్సవాల్లో భాగంగా రేపటి నుంచి మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.రవీందర్ తెలిపారు. సంగెం జడ్పీ హెచ్ఎస్‌లో 10న వాలీబాల్, 11న కబడ్డీ, 12న ఖోఖో, అథ్లెటిక్స్, యోగా పోటీలు నిర్వహిస్తారని చెప్పారు. అలాగే, చెన్నారావుపేట సిద్ధార్థ గురుకుల పాఠశాలలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీవాణి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నర్సంపేట, డిసెంబర్ 8: నర్సంపేట-నెక్కొండ రోడ్డులోని చర్చి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. బైక్‌పై వెళ్తున్న గుర్తుతెలియని వ్యక్తిని మరో వాహనం ఢీకొట్టడడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన వ్యక్తిని సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

హద్దురాళ్లు తొలగించిన వ్యక్తులపై కేసు

గిర్మాజీపేట, డిసెంబర్ 8: ఖాళీ స్థలంలోని హద్దురాళ్లు, కనీలు తొలగించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఇంతెజార్‌గంజ్ సీఐ ఎంఏ షుకూర్ తెలిపారు. దేశాయిపేటకు చెందిన జన్ను జయరావుకు 306, 307 సర్వే నంబర్లలో 368 గజాల స్థలం ఉంది. సిలువేరు మోహన్‌బాబు, గిరిబాబు, వినయ్ స్థలంలోకి అక్రమంగా చొరబడి అందులో ఉన్న కనీలను తొలగించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు సీఐ తెలిపారు.

రోడ్డుపై భారీ కొండ చిలువ

నర్సంపేటరూరల్, డిసెంబర్ 8: నర్సంపేట-వరంగల్ ప్రధాన రహదారిలో ఆదివారం రాత్రి భారీ కొండ చిలువ ప్రత్యక్షమైంది. మహేశ్వరం గ్రామ శివారు వే బ్రిడ్జి సమీపంలో నర్సంపేట-వరంగల్ ప్రధాన రహదారిపై నుంచి భారీ కొండ చిలువ వెళ్తుండగా వాహనదారులు కనిపెట్టారు. ఆ కొండ చిలువను వెంబడించే లోపే సమీప పొలంలోకి వెళ్లిపోయిందని స్థానికులు తెలిపారు. ఈ కొండ చిలువ 6 ఫీట్లకు పైగానే పొడవు ఉన్నట్లు పేర్కొన్నారు.

నర్సంపేట-వరంగల్ ప్రధాన రహదారిపై నుంచి వెళ్తున్న భారీ కొండ చిలువ

భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు

పోచమ్మమైదాన్, డిసెంబర్ 8: టీటీడీ దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో 11 గీతా జయంతి సందర్భంగా భగవద్గీతలోని ఆరో అధ్యయం నుంచి ఆత్మ సంయమయోగం శ్లో కంఠస్థ పోటీలు నిర్వహించనున్నారు. ఈ నెల 11న హనుమకొండ నక్కల గుట్టలోని ఎస్ఎంఆర్ పాఠశాలలో 6, 7వ తరగతులను మొదటి గ్రూపుగా, 8, 9 తరగతులను రెండో గ్రూపుగా విభజించి విద్యార్థినీ విద్యార్థులకు పోటీలు ఏర్పాటు చేస్తామని నిర్వాహకుడు రామిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. అలాగే, 18 అధ్యయాలు పూర్తిగా వచ్చిన వారిని కూడా రెండు విభాగాలుగా వేరు చేసి పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆరు నుంచి 18 ఏళ్ల వరకు ఒక బ్యాచ్, 18 ఏళ్లు పైబడిన వారికి రెండో బ్యాచ్‌గా విభజించి పోటీలు నిర్వహిస్తామని వివరించారు. ఆసక్తి ఉన్నవారు ఈ పోటీల్లో పాల్గొనాలని కోరారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ మీసేవ ఆధ్వర్